

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - ఎనిమిదవ కథ -

"మేడం మీకు బాగా తెలిసిన వాళ్ళంట . మాట్లాడతారంట!" నర్సు చెప్పింది.

ఎవరై ఉంటారు అనుకుంటూ ఉంటే ఓ అమ్మాయి లోపలికి వచ్చింది.

ఇరవై, ఇరవైరెండేళ్ళు ఉంటాయేమో!

గులాబీ రంగు లేసు అంచు కుట్టిన తెల్లటి సిల్క్ పరికిణీకి, తెల్లని బ్లౌజ్, పింక్ ఓణీ వేసుకుంది. అమ్మాయి సన్నగా పొడుగ్గా ఉంది. భుజాని పొడుగ్గా వేళాడుతున్న ఓ హాండ్ బాగ్. జడ వేసుకుంటే బాగుండేది అనిపించే పొడుగాటి జుట్టు కు పైన ఒక క్లిప్ పెట్టి వదిలేసింది.

"బాగున్నారా అండీ?" అంటూ పలకరించింది, బాగా తెలిసినట్టు.

ఎవరన్నట్టు చూస్తూ..."కూర్చో" అన్నాను.

కుర్చీలో కూర్చోబోతూ బాగ్ తీసి వళ్ళో పెట్టుకుంది.

'ఏదో కంప్లైంట్ ఉండి ఉంటుంది'

"మీరు మా గుర్నాథం బాబాయి వాళ్ళింట్లో చదువుకున్నారు కదా."

'గుర్నాథం బాబాయి'... లోపలున్న ఫైల్స్ అన్నింటినీ బుర్ర సెర్చ్ చేస్తోంది.

ఓ నిముషం తర్వాత 'ఫైల్ నాట్ ఫౌండ్!'

"అదేనండీ, మీరు మెడికల్ ఎంట్రన్స్ చదువుకున్నారే, ఆ డాబా మా బాబాయిదే..."

"ఒహో ..గ్రీన్ కలర్ మేడ.." అన్నాను గుర్తు తెచ్చుకుని.

"మీ నాన్నగారు ట్యూషన్లు చెప్పేవాళ్ళు కదా.."

"అవును, నీపేరేమిటి?

"రత్న"

"మా నాన్న స్టూడెంట్ వా నువ్వు..?"

"అహా కాదు..కాదు" అంటూ తనే స్కూల్లో చదువుకుందో చెప్పింది.

'ఏం పని మీద వచ్చావు? వచ్చిన పనేంటో చెప్పు.' లాంటి ప్రశ్నలు వేద్దామనుకుని, మరీ మొరటుగా ఉన్నాయని ఆ అమ్మాయే చెప్తుందిలే అని చూస్తున్నాను.

షెల్ఫ్ లో ఉన్న పుస్తకాలూ, గోడ మీద పెయింటింగ్ నూ చూసింది. ఆ పెయింటింగ్ లో ఉన్న చిన్న బాబుని వేలితో చూపిస్తూ "మీ బాబా?" అడిగింది.

"కాదు, అది బొమ్మే" అన్నాను.

"ఇద్దరు పిల్లలు కదా మీకు.."

"ఊ..."

ఇంక ఉన్న సహనం ఖర్చైంది. "ఏమైనా చూపెట్టుకోవాలా?" అడిగాను.

"అహ..ఏం లేదు. అయినా మా ఫామిలీ డాక్టర్ గారి దగ్గరే చూపిస్తుంది మా మమ్మీ. ఊరికే ఇటు వెళ్తూ వెళ్తూ చూసెళ్దామని వచ్చాను."

అంతా ఉట్టిదే అంటోంది మనసు.

"మొటిమలు ఎందుకువస్తాయండీ?" అడిగింది

"ఈ ఏజ్ లో సహజమే అవి." ఇంకా వివరణ ఇచ్చుకోలేక..

"అంటే నాకు ఎప్పుడూ పీరియడ్స్ రాబోయేముందు పింపుల్స్ వస్తాయి. తర్వాత తగ్గిపోతాయి." మొహం మీద చూశాను. అద్దంలా ఉంది. ఒక్క మొటిమ కూడా లేదు.

"అంతా బాగానే ఉందిగా."

"మొన్నటివరకూ బాగా విపరీతంగా ఉన్నాయి. మొన్న గంధం, పసుపు కలిపి రాస్తే తగ్గిపోయాయి. పీరియడ్స్ రెగ్యులర్ గా రావాలంటే ఏం చెయ్యాలండీ."

"ఏం చెయ్యక్కర్లేదు. సహజంగా వచ్చేవే పీరియడ్స్. ఇర్రెగ్యులర్ గా వస్తున్నాయంటే ఏదో ఒక కారణం వుంటుంది. అదేమిటో చూసి ట్రీట్ మెంట్ ఇవ్వాలి .పీరియడ్స్ ఏమైనా ప్రాబ్లమా?"

"నాకెప్పుడూ సరిగ్గా టైం కు రావండీ. నెక్స్ట్ వీక్ మమ్మీ వాళ్ళు అన్నవరం వెళ్ళాలనుకుంటున్నారు. త్వరగా రావడానికి ఏమైనా మెడిసిన్ ఇవ్వండి."

"ఆకలి ఎలా ఉంది?"

"బాగానే ఉంది. కాకపోతే మొదటినుండీ నాకు గాస్ట్రిక్ ప్రాబ్లం ఉంది. ఏం తిన్నా వాంతవుతుంది."

పీరియడ్స్ లేటవడం , వాంతులవడం ......అవన్నీ మామూలంటోంది.

అమ్మాయి మాటల్లో తేడా తెలుస్తూనే ఉంది.

నాకే కాదు, కొన్నేళ్ళు అనుభవమున్న గైనకాలజిస్టులకు ఆడపిల్ల లోపలికి అడుగుపెట్టగానే కొన్ని వివరాలు తెలిసిపోతుంటాయి.

"ఎవరొచ్చారు నీతో?"

"కజిన్ బ్రదర్"

కజిన్ అనాలి , లేదా బ్రదర్ అనాలి. అసలీ 'కజిన్ బ్రదర్' అనే పదప్రయోగమే తప్పు.

తప్పు చేసినవారికి ఎక్కువగా అక్కరకొచ్చేదీ ఈపదమే.

సరే ఒక సారి చూస్తాను, లోపలికి రమ్మంటే.."వద్దండీ. అంతా బాగానేఉంది. పీరియడ్స్ రావడానికి టాబ్లెట్లు ఇస్తే చాలు." అంటోంది. కుర్చీలోనుండి కదలకుండా.

ఆ అమ్మాయి మాటలకు, ప్రవర్తనకూ , మనసులో అనుమానం చెట్టు బలంగానూ త్వరగానూ పెరుగుతోంది.

“చూస్తే నష్టం లేదు కదా !” అని బెల్ కొట్టాను.

నర్సొచ్చింది. నర్సు అప్పటికే ఆమె పేరు మీద ఫైల్ అదీ ప్రిపేర్ చేసి అది పట్టుకుని నిల్చుంది.

దాంట్లో ఇంకా ఏం రాయలేదు.

“ అమ్మాయిని లోపల పడుకోబెట్టు.”

పొట్ట మీద ఉన్న డ్రెస్ పక్కకు తీయడానికి ఒప్పుకోదు. ఎంత చెప్పినా సరే...”వద్దు. నాకుసిగ్గు .....నాకు సిగ్గు” అంటోంది. . చేతుల్తో కప్పుకుంటోంది. ఒక చెయ్యి తొలగిస్తే, ఇంకోచేత్తో కవర్ చేసుకుంటోంది. పొట్ట మీద పరీక్ష చేద్దామంటే ఒప్పుకోదు. డ్రెస్ పైనే చూడండంటుంది. అలా కుదరదంటే వెళ్ళిపోతానంటుంది.

“ఇదంతా వద్దండీ. టేబ్లెట్స్ రాసివ్వండి చాలు.”

" ఇందాకట్నుండీ చూస్తన్నా, అండీ ఏంటమ్మాయ్ అండీ, మేడం అనలేవూ " అంటూ మా నర్సు విసుక్కుంది నా ఇగో తరఫున తను వకాల్తా తీసుకుని.

“తెలిసిన ఆంటియే కదా అని అన్నాను... తప్పా?”

“ తప్పు కాదు గానీ, ఒక్క నిముషం కో ఆపరేట్ చేస్తే నా పని నేను చేసుకుంటా. కాసేపు కళ్ళు మూసుకో. చెప్పినట్టు విను.” అంటూ ఎలాగైతేనేం, విజయవంతంగా పొట్ట మీద స్కానింగ్ ప్రోబ్ పెట్టగలిగాను.

“చక్కిలిగిలిగా ఉంది. ప్లీజ్, త్వరగా తీసెయ్యండి. ఇంతవరకూ ఎవరూ తాకలేదక్కడ.” అంటోంది. నా పనికి అడ్డం రాకుండా ..మా నర్సు ఆ అమ్మాయి రెండు చేతులూ పట్టుకుంది, ఆమె మాటలు వినిపించుకోకుండా చూస్తున్నాను.

అక్కడొక చిన్న స్విమ్మింగ్ పూల్. అందులో ఒకరెవరో ఏకాంతంగా ఈత కొడుతున్నారు.

ఒక్కడుగు వెనక్కు వేసి మళ్ళీ పరీక్షగా చూశా...నిజమే...ఆమె గర్భాశయంలో మూడునెలల పిండం, దాని కదలికలు, గుండె కొట్టుకోవడం అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అమ్మాయిని చూస్తే పెళ్ళైన సూచనలేం లేవు. ఇప్పుడీ విషయం చెప్తే ఎలా రిసీవ్ చేసుకుంటుందో..

ఎలా చెప్పాలి. ..?

నర్సు ని వేరే పని చెప్పి బయటకు పంపించాను.

“చూడు రత్నా.. నీకు పీరియడ్స్ ఎందుకు రావడం లేదో నీకేమైనా ఐడియా....అదే ..ఏదైనా అనుమానం ఉందా?”

“నాకు మొదటినుండీ అంతేనండీ... చాలా ఇర్రెగ్యులర్ . సరిగ్గా రావు.”

“ ఇప్పుడు మాత్రం ఒక ప్రాబ్లం ఉంది.”

ఏంటన్నట్టు చూస్తోంది.

“స్కానింగ్ చేశాను...అందులో ..ఐ మీన్ అక్కడ....” నాకే ఏదో తడబాటొచ్చింది. “ధైర్యంగా ఉంటానంటే చెప్తాను.”

“చెప్పండి.”

“ స్కానింగ్ లోమూడో నెల ప్రెగ్నన్సీ కనిపిస్తోంది.”

“వాద్దాయూ మీన్?” అంటూ గుప్పెటతో పరికిణీ అంచులు పట్టుకుని టేబిల్ మీద నుండి ఒక్క దూకు దూకేసింది.

“ఏమ్మాట్లాడుతున్నారు?” అంది గొంతు పెద్దది చేసి “ ఏమ్మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా?” మళ్ళీ అరిచినట్లే మాట్లాడింది.

ఆమె అరుపుకు నర్సు లోపలికి వచ్చింది.

ఆ అమ్మాయి ధోరణి కొద్దిగా విచిత్రంగా అనిపించినా, నర్సుకు తెలియడం మంచిది కాదని "ఏం లేదు, వెళ్ళు" అన్నాను. నర్సు అనుమానంగా చూస్తూ బయటికి వెళ్ళింది.

పరికిణీ కట్టుకుంటూ

"ఒక ఆడపిల్లమీద ఇలా అభాండం వెయ్యడానికి మీకు మనసెలా ఒప్పింది. మీకూ ఒక అమ్మాయుంది. ఆమెనెవరైనా ఈ మాటంటే ఎంత బాధ పడతారు. నేను అబ్బాయిలకు చాలా దూరంగా ఉంటాను. అసలు వాళ్ళతో మాట్లాడడమే తప్పనుకుంటాను." అంది రోషంగా.

ఇదేంటి నేను చూసింది తప్పా. ఏమైనా పొరపాటు పడ్డానా?? ఆ అమ్మాయి అరుపులకు నామీద నాకే అనుమానమొచ్చింది.

ఛా. ఛా. లేదు లేదు . నేను సరిగానే చూశాను.

"నిన్నేదో అనాలని, నిన్ను అవమానం చెయ్యాలని నాకెందుకుంటుంది. ఉన్న విషయం చెప్పాను. అంతే."

"ఏం చెప్తారండీ నాగురించి. అసలేం తెలుసు నాగురించి.... ఇంత నీచంగా మాట్లాడడానికి . ఈ విషయం ఊరికే వదలను. చాలా దూరం వెళుతుంది . గుర్తుంచుకోండి. సొసైటీలో రెస్పాన్సిబుల్ పొజిషన్ లో ఉండి మీరిట్లా మాట్లాడుతున్నారంటే..." కాసేపు గాప్ తీసుకుని " ఓ..హ్ గాడ్ ...నమ్మలేకపోతున్నాను. "

టేబిల్ మీద ఉన్న తన పేరు గల ఫైల్ తీసుకుని విసురుగా వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన కాసేపటికి

"ఏమన్నారు మేడం తనని?" నా రూం డోర్ తెరిచి ఆ తలుపు ఒక చేత్తో పట్టుకుని అడుగుతున్నాడు ఒక అబ్బాయి.

ముదురు నీలం మీద సన్నని తెల్ల గళ్ళ షర్ట్. ముఖం మీదకు పడే అందమైన జుట్టు. లేతగా ఉన్నాడు ఆ అబ్బాయి. అతని భుజాన కాలేజ్ స్టూడెంట్స్ వేసుకునే బాగ్ ఉంది.

"ఎవరు నువ్వు?" విసుగ్గా అన్నాను.

"నేను రత్న కజిన్ ని."

ఎదురుగా కూర్చుని " మా కజిన్ ను ఏదో అన్నారంట. ఏమన్నారు మేడం, ఏడుస్తుంది బయట?" ముందుకు పడుతున్న జుట్టుని వెనక్కు

విదిలించాడు..

'ఎవరితోనైనా పెట్టుకో...యూత్ తో వద్దు'

' యూత్ అనుకుంటే ఏదైనా సాధిస్తారు' లాంటి లాంటి డైలాగులు వంట్లో బలంగా పేరుకున్నట్లున్నాయి.

"ఏమన్నానంది..?"

"తను చెప్పడం లేదు. మీరు ఇన్సల్ట్ చేశారని ఏడుస్తోంది."

"ఉన్న విషయం చెప్పాను అంతే. సమస్య ఉంది. దాన్ని పరిష్కరించుకోవడానికి చూడండి. నాతో పోట్లాట అనవసరమైన టైం వేస్ట్ "

బెల్ కొట్టాను.

నర్సు వచ్చింది.

"ఇతన్ని బయటకు తీసుకెళ్ళు." చెప్పాను.

నా వంక కోపంగా చూస్తూ బయటకు వెళ్ళాడు.

***

అది జరిగిన నాలుగైదు రోజులకు, మాకు దగ్గర్లో ఉన్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నుండి ఫోన్ వచ్చింది. అప్పుడపుడు గైనిక్ కేసులు చూడడానికి వెళ్తుంటాను. ఆ హాస్పిటల్ నుండి అప్పుడప్పుడు కేసులు చూడమని పిలుపు వస్తుంటుంది.

"ఏంటి కేసు?"

"అటెంప్టెడ్ సూయి సైడ్ ,  సెల్ఫ్ పాయిజనింగ్. ఆమె దగ్గర మీ ఫైల్ ఉంది."

"ఏం వ్రాశానో చూడు."

"ఏం రాసి లేదు మేడం. ఖాళీ ఫైల్!"

అట్టెంప్టెడ్ సూయి సైడ్...ఖాళీ ఫైలు. ....ముందు రత్నే గుర్తొచ్చింది.

నేను వెళ్ళేసరికి ఆమెను అటెండ్ అయిన డాక్టర్ ఎదురొచ్చాడు.

" త్వరగానే తీసుకొచ్చారు.స్టమక్ వాష్ ఇచ్చి, యాంటి డోట్ కూడా ఇచ్చేశాము. పేషంట్ స్టేబుల్ గానే ఉంది. ”

“ఏం తీసుకుంది?”

“ఈ అమ్మాయి వాళ్ళ సిస్టర్ కు సెరెబ్రల్ పాల్సీ అట. ఫిట్స్ వస్తుంటాయని డైలీ మెడిసిన్స్ వాడుతుంటారట. అవి ఒక సీసా  మొత్తం మింగేసిందట.”

“అతనే మళ్ళీ చెప్పాడు. యంగ్ పేషంట్ , సూయి సైడ్ అట్టెంప్ట్ ... అనుమానమొచ్చి స్కాన్ చేశాము. ప్రెగ్నన్సీ ఉంది.”

“ఆ...చూశాను.”

“అందుకేనా, ఫైల్ లో ఏం రాయలేదు..”

అటూ ఇటూగా తలూపాను.

రత్నను చూడడానికి వెళ్ళాను. మనిషి స్పృహలోనే ఉందికానీ, మాటల్లో క్లారిటీ లేదు. ఏమ్మాట్లాడుతోందో సరిగా అర్థం కావడం లేదు. ఏదేదో చెప్తోంది. ఏడుస్తోంది. అక్కడక్కడా కొన్ని పదాలు క్లియర్ గా ఉన్నాయి.

“నన్ను చచ్చిపోనివ్వండి. నేను బతకను . నాకు బతకాలని లేదు.” అని ఏడుస్తోంది.

“మేడం కొంచం రికవర్ అయిన తర్వాత మీకు రిఫర్ చేస్తాము. ఆ ఎం టీ పీ అదీ.. ..క్లియర్ ఇండికేషన్స్ ఉన్నాయికదా. ఎర్లీ ప్రెగ్నసీ, పాయిజనింగ్ , పైగా అన్ మారీడ్...”డాక్టర్ అన్నాడు.

“అలాగే పంపించండి. లేదా ఇక్కడ చెయ్యమన్నా చేస్తాను.”

నేను తనని చూసి బయటకు వచ్చే సరికి తెల్లవారు జాము అయిదయింది. బయట వచ్చి చూస్తే ఒకావిడ నుంచుని ఉంది.

బాగా వెలిసిపోయిన అరిటాకు పచ్చ చీర, బూడిదరంగు జాకెట్టు. అర్థ రాత్రి హడావుడిగా వచ్చిందేమో, జుట్టు రేగిపోయి ఉంది. బోసిగా ఉన్న నుదురు. ముడతలు పడిన చేతులు. చేతిలో చిల్లర నోట్లున్నాయి. ఆటోకి ఇవ్వగా మిగిలిన చిల్లర కాబోలు. వాటిని గట్టిగా పట్టుకుని గాజు కళ్ళతో ఆత్రంగా చూస్తోంది.

రత్న పోలికలు కనిపిస్తున్నాయి కానీ, ఆ అమ్మాయి తల్లి ఈవిడా అని ఆశ్చర్యపోయేంత బీద స్థితిలో ఉంది.

“రత్న మీకేమవుతుంది.”

“కూతురేనండీ.”

"ప్రస్తుతానికి పర్లేదు. ఇవాల్సిన ట్రీట్ మెంట్ అంతా ఇచ్చారు. భయపడొద్దు."

ఆమె భోరుమని ఏడుస్తుంది అనుకున్నాను గానీ,కానీ అలాగే చూస్తూ నిలబడింది.

కష్టాలు మరీ ఎక్కువగా అనుభవించేవారికి , ఏడుపు రావడం కష్టం.

రత్న కోలుకున్న తర్వాత మా హాస్పిటల్ కు పంపించేశారు. బాగానే ఉంది. తిరుగుతోంది.

వాళ్ళ అమ్మకు విషయం వివరించాను. అన్ని దెబ్బలతో పాటే ఇదో దెబ్బ అయింది. కానీ గట్టి దెబ్బే ...

ఆమె మా హాస్పిటల్ కు వచ్చిన తర్వాత, రత్నకు అబార్షన్ చేశాను. గర్భంలో ఉన్న శిశువుకు ముఖ్యమైన అవయవాలు ఏర్పడేదశలో కొన్ని ప్రమాదకరమైన మందులు వాడడం ఒక కారణమైతే , పెళ్ళికాకుండా వచ్చిన గర్భం వల్ల ఎదురయ్యే సమస్యల నుండి తప్పించడమే ఇంకో కారణం.

ఓ రోజు వాళ్ళమ్మ మధ్యాహ్నం ఓ పీ అయిన తర్వాత వచ్చింది.

" కాలేజీ అయిపోయింది. ఆ టీచరుద్యోగం కోసమని పరీక్షలు రాస్తంది. అది కూడా శ్రద్ధగా చదవదు. ఇంట్లో కూర్చుని చదువుకోవే అంటే వినకుండా స్నేహితురాలితో కలిసి చదువుకుంటానని రోజూ పోతంది. సాయంత్రం ఎక్కడికో ఫ్రెండింటికెళ్ళిందమ్మా. అక్కడేం జరిగిందో వచ్చేసరికి మొహమంతా మాడ్చుకుని వచ్చింది. అన్నం తినమంటే ఇంతెత్తున ఎగిరింది. ఈ మధ్యన దాంతో ఏం మాట్లాడలన్నా బయమవుతుంది. ఒకటే కోపం. నిదరొస్తందని లోపలకెళ్లి గడెట్టుకుంది. ఎందుకో నాకు అనుమానంగానే ఉండి, నిద్రబోకుండా మెలకువగానే ఉన్నా.. . మధ్యరాత్రిలో లెగిసి వంటింట్లో కెళ్ళింది. ఆకలేసింది కాబోలు అన్నం తినడానికెళ్ళిందనుకున్నాను.

మళ్ళీ నేను కదిలితే తినకుండా వెళ్ళిపోతుందేమోనని కదలకుండా పడుకున్నాను. అయిదునిముషాల తర్వాత గదిలోపలికి వెళ్ళిపోయింది. వంటింట్లో లైట్ అలాగే వేసే ఉందని , తీద్దామని వెళ్తే ,ఎక్కడి గిన్నెలు అక్కడే ఉన్నాయి. వంటింటి గట్టు మీద చిన్నదాని మందు సీసా ఖాళీగా ఉంది.

గబగబా గదిలోకెళ్ళి దీనివాలకం చూస్తే మన లోకంలో లేదు. పక్కింటబ్బాయి సాయం తీసుకుని ఇటొచ్చాం."

"ఇల్లెలా గడుస్తుంది?"

"గుడి దగ్గర కొబ్బరికాయల షాపుందమ్మా. అదే తిండిపెడతంది."

"ఇక తెలుసుకుంటుందిలే బాధ పడకు."

"ఏం తెలుసుకోటమోనమ్మా. సోకులు చేసుకుంటంటే, ఏమోలే వయసు పిల్లకదా.. అట్టా తయారవాలనిపిస్తదేమోలే అని ఊరుకున్నా. అమ్మనటం మానేసింది. మమ్మీ మమ్మీ అని పట్టుకుంది. ఇంట్లో అదిలేదు ఇదిలేదు డైనింగ్ టేబుల్ లేదు, సోఫాల్లేవు. అందరికీ అన్నీ ఉన్నాయి, మనకే ఏదీ లేదని గొడవ. ఆ పిల్లాడు మాకు తెలిసినోళ్ళ అబ్బాయే. చదూకునే పిల్లాడు, దీనికన్నా చిన్నోడే. పెళ్ళి అదీ చేసుకునే వయసూ లేదు. తండ్రెదురుగా నుంచునే ధైర్యమూ లేదు. దీనికన్నా చిన్నపిల్ల , పుటకనుండీ మాటా పలుకూ లేదు. నడవలేదు. అన్నీ మంచం లోనే. దానికి అక్కను చూస్తే పండగే. ఇదింటికి రాగానే"ఆ...ఊ.." పిలుస్తది.మధ్యమధ్యలో ఫిట్స్ వస్తుంటయ్యి దానికి. తోడబుట్టిన దాని మొహమైనా చూడదు."

రత్నని పిలిపించాను.

మొహం కోపంగా పెట్టుకుని వచ్చి కూర్చుంది.

"ఎలా ఉంది రత్నా?" పలకరించాను.

“ఒకె..బాగానే ఉంది.”

“కొన్నాళ్ళు ఇంటి దగ్గర రెస్ట్ తీసుకో. కోలుకున్న తర్వాత ఉద్యోగం కోసం ఎగ్జామ్స్ ఉన్నాయంట కదా. వాటికి జాగ్రత్తగా ప్రిపేర్ అవు.”

నా మాటలు విసుగ్గా ఉన్నాయని, తనకు నచ్చడం లేదనీ  తెలుస్తూనే ఉంది.

డిశ్చార్జ్ అయి వెళ్ళిపోయిన ఓ పదిరోజుల తర్వాత, ఓ రోజు ఆపరేషన్ కు వెళ్ళబోతుంటే తల్లితో కలిసి వచ్చింది రత్న. అదే బాగ్, తల్లితో తనకేమీ సంబంధం లేనట్లు కూర్చుంది. భుజానికి అదే పొద్దుగాటి బాగ్.

“ఏంటి రత్నా. ఎలా ఉన్నావు?”

అబార్షన్ రిపోర్ట్ కావాలంది.

ఎందుకంటే ...

“ఆ పోయేకాలం.  ఇప్పుడు  ఆళ్ళింటిముందు డేరా వేసుకుని కూర్చుంటాననంటుంది. ఎంత చెప్పినా వినటం లేదు. ఆళ్ళింట్లో తెలిస్తే ఆ పిల్లాణ్ణి కొట్టి సంపేస్తాడు ఆళ్ళ నాన్న. అసలే పోలీసాయన. విపరీతమైన కోపం.  మా మీద కొచ్చినా వస్తాడని హడిలి చస్తన్నా.” రత్న వాళ్ళమ్మ అంది.

“ఏంటి రత్నా, ఎందుకు వాళ్ళింటి ముందు?”

“వాళ్ళకు బుద్ధొచ్చేట్టు చెయ్యాలండీ.”

“ఎవరికి?”

“ లేకపోతే కడుపు చేసి వదిలేస్తారా. పెళ్ళెందుకు చేసుకోరో ,వాళ్ళింటిముందే కూర్చుని ధర్నా చేస్తాను.”

“నాకు అబార్షన్ కు సంబంధించిన రిపోర్ట్ కావాలి.  మా ఫ్రెండ్ వాళ్ళ అక్క మహిళా సంఘానికి సెక్రటరీ. ఆమె టీవీ చానల్ వాళ్ళనందరినీ తీసుకు వస్తానంది. జరిగిందేమిటో మీరు కూడా చెప్పాలి.”

మొదటి రోజున ప్రెగ్నన్సీ ఉందంటే ఎలా రియాక్ట్ అయ్యావో,  అదంతా చెప్పమంటావా అని అడగాలనుకుని,  సూయిసైడ్ చేసుకోబోయిన పిల్లతో అలా ఏం మాట్లాడతామని ఊరుకున్నాను.  అవతల ఆపరేషన్ కు టైమైపోతోంది.

డా. జ్యోతి గారని సైకియాట్రిస్ట్ , కౌన్సెలింగ్ కూడా బాగా కౌన్సెలింగ్ చేస్తారు.

జ్యోతి గారికి ఫోన్ చేసి ఇలా ఓ కేసుంది మీరోసారి మాట్లాడాలని చెప్పి ఆపరేషన్ కు వెళ్ళిపోయాను.

జ్యోతి గారొస్తే, నా రూం లో కూర్చోబెట్టమనీ, రత్నతో మాట్లాడడానికి వస్తున్నారని నర్స్ తో చెప్పాను.

నేను ఆపరేషన్ అయే సరికి ఆవిడ రత్నతో మాట్లాడుతున్నారు.

“పెళ్ళి చేసుకుంటారనుకో..ఎక్కడుంటారు? ఏం తింటారు?”

“వాళ్ళింట్లోనే,    వాళ్ళ ఫాదర్ అంటే ఆ అబ్బాయి భయపడుతున్నాడు. ___. ఆయన పోలీసు ఆఫీసర్, పెద్దమనిషిగా న్యాయం చెయ్యాలికదా. నన్ను కోడలిగా ఎలా ఒప్పుకోడో చూస్తాను.”

“మీరు తెచ్చుకునే తలకాయనెప్పులన్నీ, అమ్మానాన్నలు భరించి, బాధ్యత తీసుకోవాలి. పెళ్ళి చేసి ఇళ్ళలో పెట్టుకుని పోషించాలి.

నీకూ, ఆ అబ్బాయికీ  జరిగినదాంట్లో ఆ అబ్బాయి తండ్రికేం సంబంధం? అతనేం చదువుతున్నాడు?”

"ఇంజినీరింగ్ చదువుతున్నాడు ."

ఈమెకు డిగ్రీ అయిపోయింది. అతనింకా చేస్తున్నాడు.

"వాళ్ళింట్లో చెప్పగలడా ఈ సంగతి?"

"చెప్పాలి కదండీ. వాడుకుని వదిలేస్తే ఏమవుతుందో చూపిస్తాను. సరదాలు తీర్చుకోవడానికి , మోసం చెయ్యడానికి ఆడవాళ్ళు కావాలి. కడుపు చేసి పారిపోయేవాళ్ళను వదలకూడదండీ. అతనికి బుద్ధి చెప్తాను. "

"ఎవరో సరదాలు తీర్చడానికి నువ్వెందుకొప్పుకున్నావు. నీక్కూడా ఇష్టం ఉండబట్టే కదా?"

"అదేంటి మేడం, ఆడదాన్ని ప్రెగ్నంట్ ను చేసిన వాణ్ణి వెనకేసుకొస్తారే. ఆడవాళ్ళ శక్తి ఏంటో నిరూపిస్తాను... నేను తల్చుకుంటే , ఏమవుతాడో తెలిసేట్టు చేస్తాను.

" చేశాడు అంటున్నావు. స్త్రీ సహకారం లేకుండా మగవాడి ఒక్కడివల్లా అయే పని కాదు. ఆడవాళ్ళు, శక్తి అంటున్నావుకదా. జరిగిన తప్పులో మీక్కూడా బాధ్యత ఉందన్న నిజాన్ని ఒప్పుకోలేని మీరు, ఇంకేం శక్తి స్వరూపాలు. నీకు ప్రెగ్నన్సీ వచ్చింది కాబట్టి అతనిది మోసం అంటున్నావు. అదే ఒకవేళ అతనికి గర్భం వచ్చే వీలుంటే, నువ్వు మోసగత్తెవు అవుతావా?"

"అంటే నాకన్యాయం జరగలేదా?"

"జరిగింది కానీ, అలా జరగడం లో నీకూ భాగముంది. వాళ్ల ఇంటిముందు వాళ్ళింటిముందు ధర్నా చెయ్యడం అంటే, 'నేను పనీ పాటా చెయ్యను. మీ అబ్బాయితో కులాసాగా ఉంటాను, నాకు తిండిపెట్టిపోషించండని దేబిరించడం."

"అంటే అతన్ని అలాగే వదిలెయ్యాలా?"

" అతన్ని వదలలేకపోవడం నీ బలహీనత. అతన్ని సాధించాలి, శిక్షించాలి అనుకోవడం కూడా ఏదో రకంగా అతనికి దగ్గరగా ఉందామనే ప్రయత్నాలు. నిజంగా నీకు సాధించాలని ఉంటే, ఏదైనా లక్ష్యాన్ని తీసుకుని దాన్ని సాధించు. బాగా చదివి ఉద్యోగం తెచ్చుకో. మరీ శక్తి ఎక్కువైతే అతన్నికూడా పోషించేంతగా నువ్వు నిలబడు. అప్పుడు పెళ్ళి చేసుకో."

"--------------.."

" ఏదో చేసి చూపిస్తానంటున్నావే. అదేదో , ముందు మీ అమ్మకు , మీ చెల్లెలికి చేసి చూపించు. మీ అమ్మఎప్పుడైనా సరిగ్గా తిన్నదేమో పట్టించుకున్నావా? ఆవిడెంత ఎండిపోయిందో చూడు. మొన్న హాస్పిటల్ ఖర్చు ఎలా పెట్టిందో కనుక్కున్నావా. ఎక్కడో అప్పు తెచ్చి ఉంటుంది. మంచి అమ్మాయివైతే ఆ అప్పు ఎలా వచ్చిందో అడుగు. అది ఎట్లా తీర్చాలో ఆమెకో ఆలోచన చెప్పు. బాధ్యతలకు కట్టుబడినవాళ్ళే శక్తి స్వరూపాలు. ఒకరి మీద ఆధారపడి బతికేద్దామనుకునేవాళ్ళు కాదు."

ఎప్పుడూ లేనిది జ్యోతి గారి మాటలకు రత్నవాళ్ళమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది. ఆ కన్నీళ్ళకు రాయి రత్నమవుతుందేమో చూడాలి.

Post your comments